వినియోగదారుల సమస్యలు పరిష్కరిస్తాం

ఆర్జీలు స్వీకరిస్తున్న ఎస్ఈ శంకర్

మెదక్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): విద్యుత్ వినియోగదారుల సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తామని ట్రాన్స్‌కో ఎస్ఈ శంకర్ తెలిపారు. ఆదివారం జిల్లా విద్యుత్ కార్యాలయంలో వినియోగదారుల సదస్సును ఏర్పాటు చేశారు. సదస్సులో డీఈ షేక్ చాంద్‌షరీఫ్, ఏడీఈ మోహన్‌బాబు, డివిజన్ ప్రెసిడెంట్ ఆర్.నగేశ్, 5వ వార్డు కౌన్సిలర్ మామిండ్ల ఆంజనేయులు, కౌన్సిలర్ రాజు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘ కార్యవర్గం ఎన్నిక

రామాయంపేట, నవంబర్ 3: పట్టణంలోని మున్నూరుకాపు సంఘం నాల్గో బేడ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేమె యాదగిరి తెలిపారు. ఆదివారం పట్టణంలోని మున్నూరుకాపు భవనంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడిగా బీర రామచంద్రం, కార్యదర్శిగా బీర రాము, కోశాధికారిగా లాల నాగరాజు, ఉపాధ్యక్షుడిగా బీర స్వామి, సహాయ కార్యదర్శిగా గాజుల రాజును ఎన్నుకున్నారు.

ఉచితంగా మినరల్ వాటర్ అందజేత

ప్రజలకు మినరల్ వాటర్ కార్డులు అందజేస్తున్న సందీప్

రామాయంపేట, నవంబర్ 3: పట్టణంలోని ఆరో వార్డులో పుట్టి బాలమణి జ్ఞాపకార్థం ఆమె కుమారుడు సందీప్ ఉచితంగా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు మినరల్ వాటర్ కార్డులను ఆదివారం అందజేశారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభించాలి

నర్సాపూర్, నవంబర్ 3: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని కొనాలని రైతు సంఘం నాయకుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి పది రోజులు గడుస్తున్నా ధాన్యం కొనుగోలులో ఆలసత్వం వహిస్తున్నారన్నారు. వర్షం పడి ధాన్యం తడుస్తుంటే ప్రభుత్వం స్పందించడం లేదని, వెంటనే కొనాలని డిమాండ్ చేశారు.

గ్రాడ్యుయేట్ సంక్షేమానికి ఆర్థిక సాధికారత బోర్డు ఏర్పాటుకు కృషి

మెదక్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): గ్రాడ్యుయేట్ సంక్షేమానికి ఆర్థిక సాధికారత బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తానని మెదక్, నిజామాబాద్, కరీంగనర్, ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి పడాల రవీందర్ మాధవ్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాలలో మీడియా సమావేశం నిర్వహించారు. పట్టభద్రులు ఈ నెల 6వ తేదీ వరకు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాజు, గట్టయ్య, రాజశేఖర్, మహమ్మద్ పాషా, నరేశ్, ఉమా కుమారి, గీత, స్వప్న, శ్రీకాంత్, రమేష్ పాల్గొన్నారు.

ముగ్గురు గంజాయి విక్రేతలకు రిమాండ్

నర్సాపూర్, నవంబర్ 3: గంజాయిని విక్రయిస్తున్న ముగ్గురిని నర్సాపూర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్‌కు చెందిన కూనపులి వికాస్ గత నెల 29న గంజాయిని పట్టణంలోని శివాలయం సమీపంలో విక్రయిస్తుండగా పట్టుకుని విచారించారు. వారి నుంచి రూ.2 వేల విలువైన 94 గ్రాముల ఎండు గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. వారిపై ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి జైలుకు తరలించారు.

కళా ఉత్సవ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో అర్చిత ప్రతిభ

అర్చిత

చిన్నశంకరంపేట, నవంబర్ 3: కళాఉత్సవ్ రాష్ట్రస్థాయి స్టోరీ టెల్లింగ్ పోటీల్లో మండలంలోని చందంపేట ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని హర్షిత ప్రథమస్థానం సాధించింది. దీంతో ఆమె జాతీయ స్థాయికి ఎంపికైంది. రెండు రోజులపాటు హైదరాబాద్‌లో నిర్వహించిన కళా ఉత్సవ్ పోటీల్లో డాన్స్‌లో ఐశ్వర్య గ్రూప్, వాయిద్యాల పోటీల్లో అఖిల్‌కు విద్యాశాఖ అదనపు డైరెక్టర్ రాజీవ్ మెమెంటో, నగదు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కళాఉత్సవ్ కమిటీ సభ్యులు అంజాగౌడ్, మాధవరెడ్డి, వంశీకృష్ణ, గైడ్ టీచర్లు మాధవి, ప్రభు రహీం ఉన్నారు. జాతీయ స్థాయికి ఎంపిక కావడంతో డీఈవో రాధాకిషన్, ఏఎంవో సుదర్శనమూర్తి, ఎంఈవో పుష్పవేణి అభినందించారు.

జిల్లాలో వరుస హత్యల కలకలం

- పోలీసులకు సవాల్‌గా మారుతున్న హత్యలు
- పది రోజుల్లోనే చిన్నశంకరంపేటలో రెండు హత్యలు
- మృతదేహాల వద్ద లభించని ఆధారాలు
- మృతులు బీహార్ రాష్ట్రానికి చెందిన వారిగా అనుమానం

మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్, (నమస్తే తెలంగాణ)/చిన్నశంకరంపేట, నవంబర్ 3: వరుస హత్యలు జిల్లాలో కలకలం రేపుతున్నాయి. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో హత్యలు ఒకే తరహాలో జరుగుతున్నాయి. దుండగులు అతికిరాతంగా హత్య చేసి, మృతులకు సంబంధించిన ఆధారాలు దొరకనీయకుండా జాగ్రత్త పడుతున్నారు. ఈ కేసును ఛేదించకముందే తరహాలో మరో హత్య చేస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులను బండరాయితో కొట్టి అతి కిరాతకంగా హత్య చేసి, మృతదేహాలకు నిప్పంటించి గుర్తు పట్టరాకుండా చేస్తున్నారు. ఈ హత్యలు పథకం ప్రకారం జరుగుతున్నాయా? లేదా సైకో లాంటి వ్యక్తులు చేస్తున్నారా? అన్న విషయం అంతుపట్టడం లేదు. ఏది ఏమైనా వరుస హత్యలు పోలీసులకు పెను సవాల్‌గా మారాయి.

హత్యల మిస్టరీ తేలేనా?

చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని దవాఖాన ఆవరణలో గత నెల 24న గుర్తు తెలియని యువకుడిని బండరాయితో కొట్టి కిరాతకంగా హత్య చేసి ఆపై మృతదేహాన్ని గుర్తుపట్టకుండా కాల్చేశారు. అనంతరం మృతదేహాన్ని చెత్తతో పాటు ప్లాస్టిక్ టీ గార్డెన్‌లో వేసి తగలబెట్టి మృతదేహాన్ని గుర్తు పట్టకుండా చేశారు. తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, రామాయంపేట సీఐ వెంకట్‌రాజాగౌడ్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మెదక్ నుంచి క్లూస్ టీంను రప్పించారు. సీసీ ఫుటేజీను పరిశీలించారు. పది రోజుల వ్యవధిలోనే చిన్నశంకరంపేట పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఆదివారం చిన్నశంకరంపేట బస్టాండ్ సమీపంలో సుమారు 32 ఏండ్ల యువకుడు హత్యకు గురయ్యాడు. మృతుడిని దుండగులు పెట్రోల్ పోసి దహనం చేశారు.

మృతదేహాల వద్ద లభించని ఆధారాలు

చిన్నశంకంపేటలో సుమారుగా 25 పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో ఎక్కువగా స్టీల్ పరిశ్రమలు వెలిశాయి. ఆ పరిశ్రమల్లో వివిధ రాష్ట్రాలైన బీహార్, జార్ఖండ్, మహారాష్ట్రాలకు చెందిన వారు ఉపాధి పొందుతున్నారు. పరిశ్రమల్లో పనిచేస్తున్న వారిని హత్య చేస్తున్నారా.. లేక చిన్నశంకరంపేట మండల కేంద్రానికి చెందిన వ్యక్తులను మర్డర్ చేస్తున్నారా? అనేది పోలీసులకు అంతుచిక్కడం లేదు. హత్య చేసిన స్థలంలో మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించడం లేదు. దుండగులు హత్య చేసిన అనంతరం పెట్రోల్ పోసి దహనం చేస్తున్నారు. దీంతో మృతదేహం కాలిబూడిదై, మృతుడి ఆచూకీ లభించడం లేదు. దీంతో మృతులు ఎవరనేది గుర్తించడం పోలీసులకు సవాల్‌గా నిలుస్తున్నది.

క్లూస్ దొరికేనా.. మిస్టరీ వీడేనా..?

జిల్లాలో జరుగుతున్న హత్య కేసులు పోలీసులకు సవాల్‌గా మారుతున్నాయి. పోలీసులకు ఆధార్ డేటా యాక్సెస్ లేకపోవడంతో గుర్తు తెలియని మృతదేహాలను ఆధార్ నంబర్‌తో గుర్తించే అవకాశాలు ఉంటాయి. మృతదేహం ఫింగర్ ప్రింట్స్‌ను ఆధార్ బయోమెట్రిక్ చెక్ చేస్తే మృతుడి వివరాలు లభిస్తాయి. కానీ సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం ఆధార్ బయోమెట్రిక్ చేసే అనుమతి ఇతర సంస్థలకు లేదు. పోలీసులు, సెంట్రల్ దర్యాప్తు సంస్థలకు కూడా ఆధార్ డేటా యాక్సెస్ లేదు. ఆ ఫెసిలిటీ ఉంటే ఐరిస్, ఫింగర్ ప్రింట్స్ ఆధారంగా మృతుల వివరాలు తెలుసుకునే చాన్స్ ఉంటుంది. ఆధార్ డేటాను ఇతరులకు యాక్సెస్ ఇవ్వడంతో వ్యక్తిగత గోప్యతకు ప్రమాదం వాటిల్లుతుందని ఆధార్ డెవలపర్స్‌కు మాత్రమే యాక్సెస్ ఉండేలా కేంద్ర ప్రభుత్వం రూల్ పెట్టింది. సీసీ టీవీ ఫుటేజ్, సైంటిఫిక్ ఎవిడెన్స్‌తో పోలీసులు ఎన్నో కేసులు ఛేదిస్తున్నారు. కానీ గుర్తు తెలియని మృతదేహాలను గుర్తించడంలో చాలా సవాళ్లు ఎదుర్కొంటున్నారు.

గుర్తు తెలియని యువకుడు దారుణహత్య

ఓ గుర్తు తెలియని యువకుడ్ని దుండగులు బండరాయితో కొట్టి కిరాతకంగా హత్య చేసిన మృతదేహానికి నిప్పంటించిన ఘటన చిన్నశంకరంపేట గ్రామ శివారులోని అనంత పద్మనాభస్వామి గుట్ట వద్ద గల బస్టాండ్‌లో ఆదివారం జరిగింది. సుమారు 32 ఏండ్ల వయస్సు గల గుర్తు తెలియని యువకుడిని చేగుంట, మెదక్ ప్రధాన రహదారిపై ఉన్న బస్టాండ్‌లో దుండగులు బండ రాయితో కొట్టి హత్య చేసి, నిప్పంటించారు. సమాచారాన్ని అందుకున్న చిన్నశంకరంపేట ఎస్సై నారాయణ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఘటనా స్థలాన్ని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, రామాయంపేట సీఐ వెంకట్‌రాజాగౌడ సందర్శించి, క్లూస్ టీం రప్పించి వివరాలు సేకరించారు. జాగిలం మృతదేహం నుంచి సమీపంలోని అయ్యప్పస్వామి దేవాలయం సమీపంలోకి వెళ్లి ఆగిపోయింది. పోలీసుల దర్యాప్తునకు ప్రజలు సహకరించాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేసి, నిందితులను త్వరలోనే పట్టుకుంటామన్నారు. గ్రామాల్లో వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు.

పేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసా

నర్సాపూర్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

మనోహరాబాద్: సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న బీఆర్ఎస్ మండల నాయకుడు పురం రవి ముదిరాజ్

మనోహరాబాద్ మండలం పోతారంలో బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, నవంబర్ 3: పేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసాన్నిస్తున్నదని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తెలిపారు. ఆదివారం నర్సాపూర్‌లోని క్యాంప్ కార్యాలయంలో హత్నూరా మండలం దౌల్తాబాద్‌కు చెందిన సన బేగం కుటుంబ సభ్యులకు రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. మున్సిపల్‌లోని 15వ వార్డుకు చెందిన పంబాల కిష్టయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యేతో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, నాయకులు సత్యంగౌడ్, ఆంజనేయులుగౌడ్, ప్రసాద్, నర్సింహులు ఉన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

మనోహరాబాద్, నవంబర్ 3: మండలంలోని పోతారంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బాధిత కుటుంబాలను నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి ఆదివారం పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేతో జడ్పీ కో ఆప్షన్ మాజీ మెంబర్ మన్సూర్, నాయకులు పాల్గొన్నారు.

మనోహరాబాద్

అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు దవాఖానలో చికిత్స పొంది సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి చొరవతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ మండల నాయకుడు పురం రవి ముదిరాజ్ ఆదివారం అందజేశారు. మనోహరాబాద్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన బి.శ్రీశైలం రూ.33 వేలు, వీర బోయిన సత్యనారాయణ రూ.33 వేలు, మారుతి ప్రసాద్ రూ.11 వేలు, మల్లేశ్ రూ.14 వేలు, సాదు చంద్రశేఖర్ రూ.60 వేలు, కె.రవి రూ.14,500, స్వాతి రూ.21 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.

పెద్ద చెరువును కప్పేస్తున్న గుర్రపు డెక్క


తూప్రాన్ పెద్ద చెరువులో వేగంగా విస్తరిస్తున్న గుర్రపు డెక్క

తూప్రాన్, నవంబర్ 3: తూప్రాన్ మున్సిపాలిటీగా అవతరించిన తర్వాత తొలి చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్ అధ్యక్షతన పట్టణంలోని పెద్ద చెరువు కట్ట సుందరీకరణకు అధిక ప్రాధాన్యతనిచ్చారు. వ్యయ ప్రయాసాలకోర్చి పెద్ద చెరువు కట్టను మినీ ట్యాంక్ బండ్‌గా మార్చి, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసింది. అడిగిందే తడవుగా నిధులు కేటాయించింది. అక్కడ పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన ఆట వస్తువులు, ఓపెన్ జిమ్ ఆకట్టుకుంటున్నాయి. మాజీ మంత్రి హరీశ్ రావు కృషితో బోటింగ్ సౌకర్యం కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. కొన్ని నెలల పాటు విజయవంతంగా బోటింగ్ ట్రయలింగ్ సైతం పూర్తయ్యింది. పెద్ద చెరువు కట్ట చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు ప్రయత్నాలు చేశారు. ప్రభుత్వం మారడంతో ప్రస్తుతం అక్కడ నిర్లక్ష్యం నీడలు కమ్ముకున్నాయి. అక్కడ ఏర్పాటు చేసిన ఆట వస్తువులు శిథిలావస్థకు చేరాయి. తూప్రాన్ పెద్ద చెరువు సుందరీకరణ మాట దేవుడెరుగు, అక్కడ కొత్తగా పుట్టుకొస్తున్న గుర్రపు డెక్క తొలిగింపు సవాల్‌గా మారింది. మత్స్యకారులకు చెరువే జీవనాధారం. అలాంటి చెరువులో గుర్రపు డెక్క విస్తరణను అడ్డుకోకపోతే చేపల మనుగడ తగ్గి, ఉత్పత్తి ఘననీయంగా తగ్గిపోయే ప్రమాదం ఉంటుంది. గుర్రపు డెక్కల కింద చేప పిల్లలకు ఆక్సిజన్ అందక మృతి చెందే అవకాశముంది. దీంతో మత్స్యకారులకు ఉపాధి దెబ్బతింటుంది. గుర్రపు డెక్క పర్యావరణానికి సైతం పెను ముప్పుగా మారే ప్రమాదం ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తూప్రాన్ పెద్ద చెరువులోని గుర్రపు డెక్కను తొలిగించాలని మత్స్యకారులు, పర్యావరణ ప్రేమికులు, స్థానికులు కోరుతున్నారు.

ఏడుగురు జూదగాళ్ల అరెస్టు

లక్షా7500, 3కార్లు, 8 ఫోన్లు స్వాధీనం

శివ్వంపేట, నవంబర్ 3: పేకాడుతున్న ఏడుగురిని అరెస్టు చేసిన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శభాష్‌పల్లి గ్రామ శివారులోని ఓ ఫాంహౌస్‌లో పేకాడుతున్నారన్న సమాచారం మేరకు తూప్రాన్ సీఐ రంగకృష్ణ ఆధ్వర్యంలో దాడులు చేసి ఏడుగురు జూదగాళ్లను పట్టుకున్నారు. వారి నుంచి 8 సెల్‌ఫోన్లు, 3కార్లు, లక్షా7500 నగదును స్వాధీనం చేసుకున్నారు. సీఐ వెంట శివ్వంపేట ఇన్‌చార్జి ఎస్సై రాజు, తూప్రాన్ ఎస్సై శివానందం,సిబ్బంది ఉన్నారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు, సెలఫోన్లు, పేక ముక్కలు

టేకు మొక్కలతో అదనపు ఆదాయం

పర్వతాపూర్‌లో పొలం గట్లపై టేకు మొక్కలు

నిజాంపేట మండలంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో ఏపుగా పెరిగిన టేకు చెట్లు

- రైతులకు ఉపాధినిస్తున్న టేకు వనాలు
- ఆదాయ వనరులుగా వనాలు
- రైతులకు పంటలతో పాటు సత్ఫలితాలు ఇస్తున్న టేకు మొక్కలు

రామాయంపేట, నవంబర్ 3:హరిత హారంలో నాటిన టేకు మొక్కలు అన్నదాతకు ఆదాయ వనరులుగా మారుతున్నాయి. ఐదేండ్ల క్రితం నాటిన టేకు మొక్కలు నేడు ఏపుగా పెరిగి రైతుకు ఆదాయ వనరుగా తయారయ్యాయి. రామాయంపేట, నిజాంపేట మండలాల్లో కేసీఆర్ ప్రభుత్వం అందించిన ఉపాధి హామీ పథకంలో పొలం గట్లపై రైతులు టేకు మొక్కలు నాటారు. రైతులు తాము వేసుకున్న పంటల్లోని పొలం గట్లపై వీటిని నాటడంతో అవి ప్రస్తుతం పెరిగి పెద్దవిగా మారాయి. ఐదేళ్ల క్రితం మొక్కగా ఉన్న టేకు నేడు వృక్షాలుగా మారాయి. రామాయంపేట, నిజాంపేట ఉమ్మడి మండలాల్లోని కాట్రియాల, పర్వతాపూర్, తొనిగండ్ల, లక్ష్మాపూర్, దంతెపల్లి, నస్కల్, రాంపూర్ కల్వకుంట, నందిగామ, బచ్చరాజుపల్లె, నగరం, నందగోకుల్ తదితర గ్రామాల్లో రైతులకు ప్రభుత్వ అధికారులు నాల్లో విడత హరితహారంలో ఉచితంగా అందజేశారు. దీంతో రైతులు తమ పంటలతో పాటు పొలం గట్లపై టేకు చెట్లను కూడా పెంచుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ఇతర కార్యాలయాల వద్దకూడా మొక్కలు నాటారు. నిజాంపేట మండల కేంద్రంలోని విద్యార్థుల ప్రభుత్వ బాలుర వసతి గృహం వద్ద నాటిన టేకు మొక్కలు నేడు గార్డెన్‌ను తలపిస్తున్నాయి. రోజూ హాస్టల్‌లో చదువుకునే చిన్నారులకు ఆహ్లాదాన్ని ఇస్తున్నాయి. ఏదేమైనా ప్రభుత్వం మొదటగా మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టడంతో ప్రస్తుతం ఐదేళ్ల క్రితం నాటిన మొక్కలు సత్ఫలితాలనివ్వడంతో ప్రతిఒక్కరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం బీఆర్ఎస్ పార్టీ ఆధినేత కేసీఆర్ హరితహారాన్ని ప్రవేశ పెట్టి రైతులకు ఉపాధి కల్పిస్తుండడంతో అన్నదాతలు సంతోషంగా వ్యక్త పరుస్తున్నారు.

అన్ని గ్రామాలకు టేకు మొక్కలు

రామాయంపేట, నిజాంపేట మండలాల్లోని అన్ని గ్రామాలకు ప్రభుత్వం హరితహారంలో ముందుగా టేకు మొక్కలు అందజేసింది. రైతులే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోని ఇండ్లలో కూడా టేకు మొక్కలు నాటేలా తమ ఉపాధి సిబ్బంది చర్యలు చేపట్టి నాటించారు. ఇప్పుడు అవి పెరిగి పెద్దగా మారాయి. ప్రస్తుతం ప్రభుత్వంలో కూడా టేకు మొక్కలను రైతులకు, ఇళ్ల వాసులకు ప్రత్యేకించి అందజేస్తున్నాం. రైతులు ఎక్కువ శాతం తమ పొలం గట్లపై నాటుకుని వాటి ద్వారా ఉపాధి పొందుతున్నారు.

- షాజులుద్దీన్, ఎంపీడీవో, రామాయంపేట

టేకు మొక్కలతో ఆదాయం

టేకు మొక్కలు మాకు ఆదాయాన్ని ఇస్తున్నాయి. తమ పొలం గట్లపై ఐదేండ్ల కింద కేసీఆర్ సార్ ప్రభుత్వంలో నాటిన మొక్కలు నేడు పెద్ద చెట్లుగా మారాయి. మొక్కలను పొలం గట్లపై నాటడంతో మొక్కలు ఏపుగా పెరిగి పెద్దదయ్యాయి. పొలానికి పారించిన నీటితోనే మొక్కలు పెరిగాయి. మొక్కలకు ఎలాంటి రసాయనాలు వేయలేదు. తమ పంట పొలంతో బాటు టేకు మొక్కలు కూడా తనకు ఆదాయాన్ని ఇస్తున్నాయి. ఇదంతా కేసీఆర్ సార్ చలవే.

- ఆకుల రాములు. రైతు. నందిగామ రామాయంపేట

ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలు పెంచాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్

రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

మనహరాబాద్, నవంబర్ 3: ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలు పెంచాలని, దవాఖానకు వచ్చే ప్రతిఒక్కరికీ మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మనోహరాబాద్ పీహెచ్ఎస్‌సీని ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక, బెడ్లు, స్టాక్‌లో ఉన్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల మీద ప్రత్యేక దృష్టి పెట్టి వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలన్నారు. అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 15 ఏండ్ల విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే టీం క్షుణంగా పరిశీలించి, వారి ఆరోగ్య పరిస్థితులపై నివేదిక సమర్పించాలన్నారు. వచ్చే నెల 5వ తేదీ వరకు వంద శాతం ఎన్‌సీడీ స్క్రీనింగ్ సేవలు పూర్తి చేయాలన్నారు. పీహెచ్‌సీలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు.

నేటి నుంచి కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభం

మెదక్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): జిల్లాలో ధాన్యం దించుకోవడానికి రైస్ మిల్లర్లు అంగీకారం తెలిపారని సివిల్ సప్లయ్ డీఎం హరికృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 483 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇందులో సన్నరకం కొనుగోలు కేంద్రాలు 93 కాగా, దొడ్డు రకం కొనుగోలు కేంద్రాలు 390 వరకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పదిహేను రోజుల క్రితం జిల్లా వ్యాప్తంగా 253 ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలను ప్రారంభించామన్నారు. ధాన్యం దించుకోవడానికి జిల్లాలోని 52 మిల్లులు అంగీకారం తెలిపారని పేర్కొన్నారు. జిల్లాలో సోమవారం నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమవుతాయని, రైతులు ధాన్యాన్ని నేరుగా కేంద్రాలకు తరలించాలని సూచించారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మాజీ ఎంపీటీసీ సుశీలను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట, నవంబర్ 3: అనారోగ్యంతో మృతి చెందిన పలువురు కుటుంబ సభ్యులను నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. పట్టణంలోని మాజీ ఎంపీటీసీ సుశీల భర్త మృతిచెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. శివాయపల్లిలో బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షుడు శ్రీనివాస్ బైక్‌పై నుంచి పడి కాలు విరిగింది. చీలపల్లిలో వార్డు సభ్యుడు సంగయ్య తల్లి దుర్గమ్మ, జంబికుంట గ్రామంలో మాజీ సర్పంచ్ సాయమ్మ అత్త మాణెమ్మ మృతిచెందింది. దీంతో వారిని పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, నాయకులు యాదూల్, నర్సింహారెడ్డి, సురేశ్‌గౌడ్, మాణిక్‌రెడ్డి ఉన్నారు.

రాష్ట్రస్థాయి సైక్లింగ్ క్రీడాకారుల ఎంపిక

సైక్లింగ్‌ను ప్రారంభిస్తున్న జాతీయ క్రీడాకారుడు ఖేల్ ఇండియా కోచ్ యాదగిరి

రామాయంపేట, నవంబర్ 3: రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన వారు ప్రతిభ కనబర్చి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఖేల్ ఇండియా కోచ్ దండు యాదగిరి కోరారు. రామాయంపేటలోని జాతీయ రహదారిపై జిల్లాకు చెందిన సైక్లింగ్ క్రీడాకారులతో సైక్లింగ్‌ను ఆదివారం ప్రారంభించారు. అండర్ 14, 16, 18 విభాగాల్లో ముగ్గురు క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో పాల్గొనేందుకు ఎంపిక చేశారు. సైక్లింగ్‌లో ప్రతిభ చాటిన ముగ్గురు క్రీడాకారులకు మెడల్స్ అందజేశారు. జనగామ జిల్లా కేంద్రంలో ఈ నెల 4, 5, 6వ తేదీల్లో జరిగే పోటీల్లో జిల్లా తరపున వీరు పాల్గొంటారని తెలిపారు.

నేడు మహమ్మద్ నగర్ సొసైటీ ప్రారంభం

కౌడిపల్లి, నవంబర్ 3: మండలంలోని మహమ్మద్ నగర్ శివారులో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయ భవనం ప్రారంభిస్తున్నట్లు సొసైటీ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, జిల్లా ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు

వివరాలు సేకరిస్తున్న సీఐ, ఎస్ఐ

పెద్దశంకరంపేట, నవంబర్ 3: పట్టణంలోని వేంకటేశ్వర కాలనీలో పోలీస్ కానిస్టేబుల్ ఇంట్లో జరిగిన దొంగతనం కేసును పెద్దశంకరంపేట పోలీసులు మూడు రో